సాక్షి
వికారాబాద్
బుధవారం ׀ 6 ׀ నవంబర్ ׀ 2024



జాతరకు వసతులు కల్పిస్తాం

ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు అన్ని వసతులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

8లో▸



విద్యుత్ తీగలకు తగిలి..

తాండూరు మున్సిపల్ మాస్టర్ ప్లాన్ కోసం సర్వే చేస్తున్న డ్రోన్ విద్యుత్ తీగలకు తగలడంతో కాలిపోయింది.

8లో▸



కుల గణనకు సర్వం సిద్ధం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

9లో▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్: గ్రూప్ – 3 పరీక్షల నేపథ్యంలో తాండూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17, 18వ తేదీల్లో గ్రూప్ –3 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయన వెంట తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

చించోళి రోడ్డుకు మోక్షం..!

నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి సర్వే



గౌతాపూర్ చౌరస్తా వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది

తాండూరు రూరల్: మండల పరిధిలోని చించోళి రోడ్డుకు మోక్షం లభించనుంది. మహబూబ్‌నగర్ – చించోళి రోడ్డును నాలుగు లేన్ల సీసీ రోడ్డుగా విస్తరించడానికి ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. తాండూరు పట్టణంలోని కొడంగల్ రోడ్డులోని ఓ రైసు మిల్లు వద్ద నుంచి బస్టాండ్ వరకు రెండు కిలో మీటర్ల సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. చిలుక వాగు కాలువపై బ్రిడ్జి నిర్మించనున్నారు. గౌతాపూర్ – చెంగోల్ ప్రధాన చౌరస్తా నుంచి అల్లాపూర్ సమీపంలోని బైపాస్ వరకు రెండు కిలో మీటర్లు మేర సీసీ రోడ్డు వేయనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్ తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రేపటి బీసీ కమిషన్ పర్యటన వాయిదా

అనంతగిరి: రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఈ నెల 7న (గురువారం) జరగాల్సిన తెలంగాణ బీసీ కమిషన్ పర్యటన.. బహిరంగ విచారణ కార్యక్రమం వాయిదా పడినట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కుల సంఘాల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తదుపరి పర్యటన వివరాలను త్వరలో తెలియజేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి



దీక్షకు సంఘీభావంగా మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించడంతో పాటు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కొత్తగడి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. లేదంటే నవంబర్ 23న ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంత్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవ్‌రెడ్డి, జిల్లా ధార్మిక విభాగం ఇంచార్జ్ కొప్పుల రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ దీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రతినిధులు రాములు, జాక వెంకటేశం, కమాల్‌రెడ్డి, ఆనందం, బుచ్చిలింగం, జిల్లా ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు రమాదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్ మండలంలో ఫార్మాసిటీ కోసం ప్రతిపాదించిన స్థలం

ఫార్మా చిచ్చు

1,358 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

- మూడు రెవెన్యూ గ్రామాల్లో పొలాలు కోల్పోనున్న అన్నదాతలు
- భూములు ఇచ్చేది లేదంటున్న రైతులు
- అధికారులకు సంకటంగా మారిన భూసేకరణ
- వంద కంపెనీలు, 15వేల మందికి ఉద్యోగాల కల్పన

వికారాబాద్: కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీ వ్యవహారం చిచ్చు రేపుతోంది. పరిశ్రమల కోసం చేపడుతున్న భూ సేకరణ అధికారులకు సంకటంగా మారింది. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టింది మొదలు కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. కడా(కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ) ఏర్పాటు చేసి రూ.5 వేల కోట్లతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పునాదులు వేశారు. ఇందులో విద్య, వైద్యం, సాగు నీరు, రోడ్ల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో పరిశ్రమలు స్థాపించాలని ప్రణాళికలు రూపొందించారు. దుద్యాల్ మండలంలో ఫార్మా ఏర్పాటు ప్రక్రియ రచ్చకు దారి తీసింది. పరిశ్రమ కోసం అవసరమైన భూముల సేకరణ అధికారులు, నేతలకు తలనొప్పిగా మారింది. పొలాలు కోల్పోనున్న రైతులకు ప్రతిపక్ష నేతలు తోడవటంతో భూ సేకరణ ప్రక్రియ లాఠీ చార్జికి దారితీసింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఐదు గ్రామాల పరిధిలో..

దుద్యాల్ మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాలు పోలెపల్లి, లగచర్ల, హకింపేట్, నోకటి బండ తండా, పుల్చెర్లకుంట తండాల పరిధిలో 1358.37 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిశ్రమకు 721 ఎకరాల పట్టా భూములు, 547 ఎకరాలు పేదలకు అసైన్డ్ చేసిన భూములు, 90 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరమని గుర్తించారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరిగి నియోజకవర్గం ఆర్థిక మండలిగా రూపాంతరం చెందేందుకు దోహదం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ఇదిలా ఉండగా తాము ఎట్టి పరిస్థితిల్లో భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెబుతున్నారు. భూములు ఇస్తే రోడ్డుపాలు అవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పలువురు రైతులు తమ పొలాలు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అధికారులు పేర్కొంటున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లటం తప్ప ఒరిగేది ఏమీలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

పరిహారం ఇలా..

2012 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే ఇంకాస్త పెంచి ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో భూమికి ప్రభుత్వ విలువ ఎంత ఉంటే దానికి మూడింతలు ఇవ్వాలని 2012 భూ సేకరణ చట్టం చెబుతోంది. ఫార్మాసిటీ ఏర్పాటు చేసే ప్రాంతంలో ఎకరాకు ప్రభుత్వ విలువ రూ. 2.25 లక్షలుగా ఉంది. ఈ లెక్కన ఎకరా భూమికి రూ.6.75 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉంది. అయితే బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. అధికారులు చెబుతున్న దాని ప్రకారం ఎకరాకు రూ.10 లక్షల పరిహారం, రూ.6 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ఎకరానికి 125 గజాల ప్లాటు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహబూబ్‌నగర్ – చించోలి హైవేకి అనుకొని అభివృద్ధి చేసే డీటీసీపీ అప్రూవ్డ్ లేఅవుట్‌లో ఈ ప్లాట్లు ఇవ్వనున్నారు. ఇక్కడ ఒక్కో ప్లాటు మార్కెట్ విలువ రూ. 15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంటున్నారు. అయితే పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములకు కూడా ఒకే రకమైన పరిహారం ఇస్తామని అధికారులు అంటుండగా అందుకు తాము అంగీకరించబోమని పట్టాభూమి రైతులు పేర్కొంటున్నారు. అయితే మెజార్టీ రైతులు పొలాలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు.

“ అభివృద్ధికి సహకరించాలి



ఫార్మాసిటీ ఏర్పాటు కోసం కేవలం భూములు మాత్రమే సేకరించాలని నిర్ణయించాం. ఇందులో ఇళ్లు పోతాయని అపోహలు సృష్టిస్తున్నారు. మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములను మాత్రమే సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలన్నీ యథావిధిగా ఉంటాయి. రైతుల నుంచి వచ్చే సూచనలు ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం. రైతులు సంయమనంతో వ్యవహరించాలి. అభివృద్ధికి అందరూ సహకరించాలి.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)

లైడార్ సర్వే ప్రారంభం

- ట్రిపుల్ ఆర్‌కు సమాంతరంగా రైల్వే లైన్
- 564 కిలో మీటర్ల దూరం
- జిల్లా మీదుగా సర్వే



సర్వే కోసం వచ్చిన హెలికాప్టర్

కొడంగల్: కొడంగల్ కేంద్రంగా మంగళవారం లైడార్ సర్వే ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రత్యేక హెలికాప్టర్ కొడంగల్‌కు చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు చుట్టూ సమాంతరంగా రైల్వే లైన్ వేయనున్నారు. రోడ్డు మార్గంతో పాటు రైల్వే లైన్ వేయడానికి హెలికాప్టర్ ద్వారా సర్వే చేస్తున్నారు. భూమి పైభాగంతో పాటు లోపల ఉన్న వాటిని లైడిటెక్టర్ వ్యవస్థ ద్వారా గుర్తిస్తారు. దీని కోసం లైడార్ సర్వే చేపట్టారు. కొడంగల్‌లో హెలిప్యాడ్ ఉన్నందున కొడంగల్ కేంద్రంగా మూడు రోజుల పాటు ఈ సర్వే చేయనున్నారు. రీజనల్ రింగ్ రైల్ ప్రాజెక్టు 564 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంటుందని ఆర్‌వీ అసోసియేట్స్ ప్రతినిధులు తెలిపారు. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, గజ్వేల్, భువనగిరి, యాదాద్రి, చిట్యాల, నారాయణపూర్, షాద్‌నగర్, షాబాద్‌లను కలుపుతూ తిరిగి వికారాబాద్‌కు చేరుకుంటుందని సమాచార. సమీప భవిష్యత్‌లో వికారాబాద్ జిల్లా వాసులకు రవాణా వ్యవస్థ మరింత మెరుగు పడే అవకాశం ఉంది. రోడ్డు మార్గంతో పాటు రైల్వే మార్గం కూడా అందుబాటులోకి రానుంది.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరమేశ్వర్‌రెడ్డి

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మన్నెగూడలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం బాగుండాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. అప్పుడే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టంగా మారాలంటే మెజార్టీ స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకంలో యాభై శాతం కేంద్రం వాటా ఉంటుందని గుర్తు చేశారు. కేంద్రం ఇస్తున్న పథకాలను తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జయప్రదబాయి

మెరుగైన ఫలితాలు రాబట్టాలి

- ఇంటర్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ జయప్రదబాయి
- జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

అనంతగిరి: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ జయప్రదబాయి అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఇంటర్ బోర్డు జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. క్లాస్ల నిర్వహణ, సిలబస్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ సారి మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. కళాశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు జిల్లా అధికారి శంకర్‌నాయక్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు నర్సింహారెడ్డి, కుమారస్వామి, సురేశ్వరస్వామి, రూపాలక్ష్మి, వెంకటేశ్వరరావు, స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత జాగ్రత్తగా నిర్వహించండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి మున్సిపల్ వార్డుల వరకు సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అధికారులు సర్వేపై ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలన్నారు. సర్వే ప్రక్రియ నేటి నుంచి(బుధవారం) ప్రారంభమవుతుందని, అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల వద్ద నివాస స్థలాల మ్యాప్‌లు, ఇళ్ల జాబితా ఉండాలన్నారు. 57 ప్రశ్నల ఫార్మట్ స్టిక్కర్‌ను ప్రతి ఇంటికీ అతికించాలని ఆదేశించారు. ఈ సర్వే ప్రభుత్వ పథకాల అమలుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని అన్నారు. మండలాల వారీగా జనాభా.. ఎంత మంది ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు అవసరం.. మున్సిపల్ పరిధిలో ఎన్ని వార్డులు ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం సేకరణ సాఫీగా జరగాలి

అనంతరం ధాన్యం సేకరణపై అధికారులతో చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది, నష్టం కలగకుండా వానాకాలం ధాన్యం సేకరించాలని ఆదేశించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్షా ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, ఇందుకోసం 126 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డీఎంహెచ్ఓ వెంకటరవణకు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సీపీఓ అశోక్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

- ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా పట్టించుకోని పోలీసులు
- సీడీఆర్ రాలేదంటూ కాలయాపన

మొయినాబాద్: మిస్సింగ్ కేసుల్లో మొయినాబాద్ పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓ బాలిక అదృశ్యమై ఐదు రోజులైనా పోలీసులు కనీసం స్పందించడంలేదు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా సీడీఆర్ రాలేదంటూ కాలయాపన చేస్తున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా మద్దూరు మండలం గద్ద గ్రామానికి చెందిన ఆశప్ప కుటుంబం కొన్నేళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. ఆశప్ప మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన చిన్న కూతురు(17) శంషాబాద్ మండలం పాలమాకుల మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది. దసరా సెలవులకు మొయినాబాద్‌కు వచ్చిన బాలిక బంధువుల పెళ్లి ఉండటంతో ఇక్కడే ఉంది. కాగా ఈ నెల 1న శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 2న మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా పోలీసులు కనీసం పట్టించుకోవడంలేదని.. సీడీఆర్ పెట్టాము.. అది రావడానికి నాలుగు రోజులు పడుతుందని చెప్పి పంపిస్తున్నారని బాలిక తండ్రి ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై నయీముద్దీన్‌ను వివరణ కోరగా మైనర్ మిస్సింగైనా.. మేజర్ మిస్సింగైనా సీడీఆర్ వచ్చేవరకు మేం ఏం చేయలేమంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు.

ఇంటి నుంచే పత్తి కొనుగోలు సమాచారం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

అనంతగిరి: పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన మద్దతు ధర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెటింగ్ శాఖ వాట్సాప్ నంబర్ 88972 81111ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా పత్తి పంట సాగు వివరాలు, క్రమ విక్రయాలు, సీసీఐ సెంటర్‌లో పత్తి కొనుగోళ్ల రద్దీ తదితర వాటిని ఇంటి నుంచే తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాండూరు, వికారాబాద్, పరిగిలో 3 చొప్పున, కోటిపల్లిలో 2, ధరూరు, మర్పల్లి, కొండంగల్‌లో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్టోబర్ చివరి నాటికి 183మంది రైతుల నుంచి 286.23 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర రావాలంటే తేమ శాతం 5 నుంచి 12 మధ్య ఉండాలన్నారు. పత్తిని విడిగా తెస్తే నాణ్యత పెరుగుతుందని, తొందరగా అమ్మకాలు జరుగుతాయని అన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ ఫోన్ నంబర్‌ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు


గాయపడిన బాలుడిని చూపుతున్న తండ్రి

కొడంగల్ రూరల్: విద్యుదాఘాతంతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దనందిగామలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బిచ్చం బసప్ప కుమారుడు మహేశ్(మూగ) ఇంటి పక్కన ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేదు. దీంతో అటుగా వెళ్లిన బాలుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఓ కంపెనీ టవర్ ఏర్పాటుకు పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్‌శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని బాధితుడి తండ్రి ఆరోపించాడు. బాలుడి తండ్రి బసప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

పరిగి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పరిగి పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు లారీని ఆపి పత్రాలను పరిశీలించగా ఎటువంటి అనుమతులు లేవు. మరో మూడు లారీలు తరలిస్తున్నట్లు సమాచారం అందగా వాటిని కూడా స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీలించారు. మూడు లారీలకు వికారాబాద్ పర్మిట్ ఉండడం, మరో లారీకి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఎస్‌ఐ సురేశ్

మర్పల్లి: సైబర్ నేరాలపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి ఎస్‌ఐ సురేశ్, ఏఎస్‌ఐ మల్లేశం అన్నారు. మంగళవారం వారు మర్పల్లి సంతలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, ఓటీపీ అడిగితే ఇవ్వొద్దని సూచించారు. ఫోన్లకు వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు అపహరణ

కొత్తూరు: గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఈ నెల 4న చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నలగంటి స్వామి కుటుంబ సభ్యులతో కలిసి వేరే ఊరెళ్లాడు. ఇది గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోని రెండు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించిన స్వామి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

కొందుర్గు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. పోలీసు పెట్రోలింగ్‌లో భాగంగా మంగళవారం ఉదయం చిన్న ఎల్కిచర్లలో ఓ వాహనాన్ని తనిఖీ చేయగా వంద బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో ఆ వాహనాన్ని, రేషన్‌బియ్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు డ్రైవర్ సురేందర్‌ను ప్రశ్నించగా గ్రామాల్లో కొనుగోలు చేసి ఎక్కువధరకు విక్రయిస్తున్నామని వివరించాడు.

కార్డులు మార్చి.. ఏమార్చి



పరిగి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం

ఏటీఎంలలో కొత్త రకం మోసం
- మోసపోతున్న అమాయకులు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పరిగి: దోమ మండలం ఖమ్మనాచారం గ్రామానికి చెందిన బండి వెంకటయ్య సెప్టెంబర్ 27న పరిగి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసేందుకు వచ్చాడు. పక్కనే ఉన్న వ్యక్తికి కార్డు ఇచ్చి డ్రా చేసి ఇవ్వమని కోరాడు. దీంతో ఆయన డబ్బు రావడం లేదంటే ఏటీఎం నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో కార్డు మార్చిన సదరు వ్యక్తి అదే రోజు పరిగిలో రూ.10వేలు, మరుసటి రోజు మహబూబ్‌నగర్‌లో రూ.21వేలు మొత్తం రూ.31వేలు డ్రా చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా మార్చిన కార్డు ఆధారంగా విచారణ చేపడితే కుల్కచర్ల మండలానికి చెందిన వ్యక్తిగా తేలింది. ఆయన్ను ప్రశ్నిస్తే తాను బాధితుడినేని చెప్పాడు.

పెరిగిన సైబర్ మోసాలు

సాంకేతిక పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాలు విపరీతమయ్యాయి. ప్రజల్లోనూ కొంత అవగాహన వచ్చినా డబ్బు స్వాహా చేసేందుకు దొంగలు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఏటీఎం కార్డులు మార్చుతూ అకౌంట్లలో ఉన్నకాడికి ఊడ్చేస్తున్నారు. దీంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకు వివరాలు, ఓటీపీలు, ఏటీఎం కార్డుల పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దంటూ పోలీసులు అవగాహనకల్పిస్తున్నా అమాయకులు ఎక్కడో ఓ చోట మోసపోతూనే ఉన్నారు.

అమాయకులే టార్గెట్

ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. బ్యాంకులు ప్రతీ ఒక్కరికి ఏటీఎం కార్డులు అందిస్తున్నాయి. లక్షకు మించితేనే బ్యాంకుల్లో విత్ డ్రా చేస్తున్నారు. దీంతో ఏటీఎంలకు వస్తున్న అమాయకులను ఏ మార్చుతున్న దుండగులు వారి అకౌంట్లలో ఉన్న నగదు ఖాళీ చేస్తున్నారు.

వందల్లో బాధితులు

ఏటీఎం మోసాలు, సైబర్ నేరగాళ్ల వలలకు చిక్కి మోసపోయిన బాధితులు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నారు. పోలీసులను ఆశ్రయించిన వారు సైతం ఎంతో మంది ఉన్నారు. పరువుపోతోందని బయటకు చెప్పకుండా మౌనంగా ఉంటున్నారు. జిల్లా కేంద్రంలో సైబర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సైబర్ క్రైం జరిగిన 24 గంటల్లో 100కు గాని దగ్గరలోని పీఎస్‌లో గాని ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తారు.

ఓటీపీలు, పిన్‌లు ఎవరికీ చెప్పొద్దు



ఏటీఎం మార్పిడి చేసి డబ్బులు దొంగలించిన ఘటనపై ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. ఏటీఎంలో డబ్బులు డ్రా కోసం వెళ్తే పిన్‌ను, ఓటీపీలు చెప్పవద్దు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– సంతోశ్ కుమార్, ఎస్‌ఐ, పరిగి

జాతరకు వసతులు కల్పిస్తాం


సమన్వయ సమావేశంలో పాల్గొన్న అధికారులు

సమన్వయ సమావేశంలో అధికారుల వెల్లడి

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలకు తగిన వసతులు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఇన్‌చార్జి ఆఫీసర్ హన్మంత్ రావు, మండల ప్రత్యేక అధికారి మల్లేశం ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, చెత్త తొలగించడం, బోర్లు బాగుచేయించడం, జాతరకు వచ్చే యాత్రికులను కంట్రోల్ చేయడం, వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి, పోలీసు పికెట్, ఫైర్ సిబ్బంది తదితర ఏర్పాట్లపై చర్చించారు. జాతరకు వెళ్లే దారిలో అడ్డుగా ఉన్న కాగ్నా నదిపై దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును బాగు చేయించాలని నిర్ణయించారు. అనంతరం జాతర ప్రాంగణంలో సౌకర్యాల కల్పనపై అధికారులు జాతర కమిటీ సభ్యులతో మాట్లాడారు. జాతర నిర్వాహణ ద్వారా దోర్నాల్ పంచాయతీకి నయా పైసా ఆదాయం రావడం లేదని.. జాతరలో నెలకొల్పే దుకాణాల ట్యాక్సును తామే వసూలు చేసుకునేలా జాతర నిర్వాహకులను ఆదేశించాలనీ నాయకులు, ప్రజలు అధికారుల ఎదుట ఆందోళన చేపట్టారు. నిర్వాహకులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని అధికారులు భరోసా ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఇన్‌చార్జి ఆఫీసర్ హన్మంత్ రావు, మండల ప్రత్యేక అధికారి మల్లేశం, జిల్లా పశువైద్యాధికారి సదానందం, సీఐ రఘురాములు, తహసీల్దార్ సాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కొనుగోలుపై ఫిర్యాదు


భూ యజమానిపై ఫిర్యాదు చేసినట్లు చూపుతున్న సిరిగిరిపేట్ గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరి పేట్ శివారులోని ప్రభుత్వ భూమి కొనుగోలు చేసిన భూ యజమానిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 109లో 26 ఎకరాల ప్రభుత్వ భూమిని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఓ వ్యక్తి కొనుగోలు చేశారని చెప్పారు. కొనుగోలు చేసిన వ్యక్తి అట్టి భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో రైతులు పొలాలకు వేళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా, పంచాయతీ తీర్మానం లేకుండానే అధికారులు భూమి విక్రయించారని ఆరోపించారు. తమ గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిలో కంచె ఏర్పాటు చేయొద్దని కోరగా సదరు యజమాని బెదిరిపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ మేరకు భూయజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, మొగులప్ప, శివప్ప, వీరన్న, ఆశన్న, రాములు, వీరన్న, భద్రు, విజయ్ కుమార్, కిష్టప్ప, బాలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు వాజీద్

మహేశ్వరం: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో అండర్–14 బాలుర విభాగం రన్నింగ్ పోటీల్లో ఎండీ.వాజీద్ సత్తాచాటాడు. మండల పరిధిలోనలి మన్సాన్‌పల్లి చౌరస్తాలోని వైష్ణవి టెక్నో స్కూల్ విద్యార్థి వాజీద్ 400 మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా వాజీద్‌ను పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ ఉప్పర్‌పల్లిలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.ఆంజనేయులు మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన మైనర్ బాలిక దుర్గానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. డ్రైవర్ వెంకటేశ్ (50) బాలికను ప్రతిరోజు తన ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్లేవాడు. 2019 జులై 31న స్కూల్ విడిచిన అనంతరం బాలికను ఇంటికి తీసుకెళ్లే సమయంలో స్థానికంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మైనర్ బాలిక కేకలు వేయడం, రోధించడంతో తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని చెప్పి ఇంటి వద్ద దింపాడు. భయభ్రాంతులకు గురైన బాలికకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లి బాలికను గట్టిగా అడగగా ఆటో డ్రైవర్ చేసిన లైంగిక దాడిని వెల్లడించింది. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.50 వేలు అందించాలని ఆదేశించారు.

విద్యుత్ వైర్లకు తగిలి డ్రోన్‌లో మంటలు

మాస్టర్ ప్లాన్ సర్వేకు బ్రేక్


విద్యుత్ తీగలు తగలడంతో డ్రోన్‌లో వ్యాపించిన మంటలు

తాండూరు: మాస్టర్ ప్లాన్ సర్వే చేస్తున్న డ్రోన్ విద్యుత్ తీగలకు తగలడంతో కాలిపోయింది. వివరాలిలా ఉన్నాయి. తాండూరు మున్సిపల్ పరిధిలో సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా డిజిటల్ డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నారు. తాండూరు మున్సిపల్ శివారులోని హైదరాబాద్ రోడ్డు మార్గంలోని రాజీవ్ కాలనీ సమీపంలో సర్వే బృందం డ్రోన్ ఎగురవేశారు. పైకి వెళ్లిన డ్రోన్‌లో ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తడంతో కిందకు వచ్చింది. ఈ క్రమంలో వ్యవసాయ పొలంలోని విద్యుత్ తీగలకు తగలడంతో డ్రోన్‌లో మంటలు చెలరేగి పంట పొలంలో పడిపోయింది. దీంతో వరి పంటకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలార్పేశారు. దీంతో సర్వే అసంపూర్తిగా నిలిచిపోయింది. డ్రోన్‌తో సేకరించిన సర్వే ఆన్‌లైన్ సాయంతో కంప్యూటర్‌లో రికార్డు చేయడంతో నాలుగు రోజుల పాటు చేసిన సర్వే భద్రంగా ఉందని అధికారులు ధృవీకరించారు. డ్రోన్ విలువ రూ.25 లక్షల మేర ఉంటుందని సర్వే బృందం వెల్లడించింది. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 20 మున్సిపాలిటీలకు ఒకే కాంట్రాక్టర్ సర్వే చేపట్టడంతో మరో డ్రోన్‌ను తీసుకొచ్చి సర్వేను పూర్తి చేస్తారని మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి తెలిపారు.

అగ్గనూరు మార్గంలో ట్రాఫిక్ జామ్


పత్తి మిల్లుకు వెళ్లేందుకు అగ్గనూరు మార్గంలో క్యూలో వేచిఉన్న వాహనాలు

- కొనుగోలు కేంద్రానికి వచ్చే వాహనాలతో ఇబ్బందులు
- పోలీసులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకోలు

యాలాల: మండలంలోని లక్ష్మీనారాయణపూర్–అగ్గనూరు మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అగ్గనూరు పరిధిలోని మారుతి జిన్నింగ్ మిల్లులో ఇటీవల సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో ఈ వైపు భారీ సంఖ్యలో పత్తిలోడ్లతో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు కొనుగోలు కేంద్రానికి వస్తున్నాయి. ఈ సందర్భంగా పత్తి మిల్లు నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీనికితోడు వాహనదారులు ప్రధాన మార్గంలో అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఈ విషయంలో పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

రెండో దశతో నగరం నలువైపులా మెట్రో

- అన్ని రూట్లూ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం
- గూగుల్ వ్యాలెట్‌ను ఆవిష్కరించిన ఎన్వీఎస్ రెడ్డి

గచ్చిబౌలి: రెండో దశ పనులు పూర్తయితే నగరం నలువైపులా మెట్రో రైలు అందుబాటులోకి వస్తుందని హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో మెట్రో రైలు ప్రయాణికుల కోసం ఆర్‌సీఎస్ గూగుల్ వాలెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. రెండో దశ పనులు వేగంగా ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా తీసుకొని సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ అన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ప్రస్తుతం రోజుకు మెట్రో రైళ్లు 1,100 ట్రిప్పులు నడుపుతున్నామని, నాగపూర్ భాగస్వామ్యంతో కొత్త రైళ్లు తీసుకొస్తామని వివరించారు. ప్రయాణికుల కోసం రూట్ మొబైల్, గూగుల్ వాలెట్, మెట్రో రైలు సంయుక్తంగా డిజిటల్ వాలెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. డిజిటల్ వాలెట్‌లో మెట్రో రైలుకు ఎక్కడి వెళ్లాలో చూపిస్తుందని, ఆటోమెటిక్‌గా పేమెంట్ చేయవచ్చన్నారు. యాపిల్ ఫోన్‌తో పాటు అన్ని రకాల ఆండ్రాయిడ్ ఫోన్లతో ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు. ఫిజికల్‌గా టికెట్ లేకుండా ప్రయాణం చేయవచ్చారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ హెచ్ఆర్ఎంఎల్ సీఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



కద్తాల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన, మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామ సమీపంలో మంగళవారం వెలుగుచూసింది. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలోని భారత్ పెట్రోలు పంప్ సమీపంలో జాతీయ రహదారి పక్కన చెట్ల మధ్యనున్న చిన్న కాల్వలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని.. నెమలి బొమ్మలతో కూడిన ఆరంజ్ కలర్ బ్లౌజ్, ఆకుపచ్చ చీర ధరించి ఉందన్నారు. ఆమె ముఖం చుట్టూ ఆకుపచ్చ రంగు టవల్, ఓ దుప్పటి ఉందని చెప్పారు. గుర్తుపట్టలేకుండా ఉన్న మహిళను రెండు రోజుల క్రితం ఎవరో తీసుకుచ్చి ఇక్కడ పడివేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఆచూకీ తెలిసిన వారు 833399 93536, 87125 68298, 94936 28100 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కర్కల్‌పహాడ్ గ్రామ పంచాయితీ కార్యదర్శి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు పిల్లర్ నంబర్ 313 సమీపంలో ఈ నెల 4న 35–40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ కానిస్టేబుల్ గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా స్థానికంగా ఆరా తీయగా అధికంగా మద్యం తాగడంతోనే ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని బుధవారం తుక్కుగూడలో నిర్వహించనున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తుక్కుగూడలోని కళాశ్రీ ఫంక్షన్‌హాలులో ఉదయం 10:30గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాసభకు రానున్న మాదిగలు డ్రెస్‌కోడ్‌ను పాటించాలని కోరారు. ఈ ధర్మయుద్ధ మహాసభకు మదిగలు, మాదిగ ఉపకులాలు, మాదిగ మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ప్రకటనలకే పరిమితం


ఇన్ముల్‌నర్వలో గోదాములు నిర్మించేందుకు గత ప్రభుత్వం గుర్తించిన స్థలం

ఆరేళ్ల క్రితం గిడ్డంగుల నిర్మాణానికి శంకుస్థాపన
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- పట్టించుకోని పాలకులు
- రైతన్నల ఎదురుచూపులు

కొత్తూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్తే ధరలపై అవగాహన లేక దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ఒక్కోమారు కనీస మద్దతు ధర లేక నష్టానికే అమ్ముకోవాల్సిన దుస్థితి. పంటల సాగు నుంచి విక్రయం వరకు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా.. లాభాలు లేకపోయిన వ్యవసాయం తనకు 'వ్యయాన్నే'తప్ప సాయాన్ని మిగిల్చకున్న ఎప్పటికైనా లాభాలు వస్తాయనే నమ్మకంతో తిరిగి పంటలను సాగు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి రైతులకు లాభాలు అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి గోదాముల నిర్మాణానికి సంకల్పించింది. వీటి వల్ల రైతులు తమ ఉత్పత్తులను ఉచితంగా గోదాముల్లో నిల్వ చేసుకోవడంతో పాటు మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పుడే విక్రయించుకోవచ్చు. నిల్వ చేసుకునేందుకు నిర్ణీత గడువు వరకు ఎలాంటి చార్జీలు లేకుండా రైతులకు సాయం చేయాలని గోదాముల నిర్మాణాలను చేపట్టింది.


శంకుస్థాపనకే పరిమితం

రైతుల ప్రయోజనం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో సర్వే నంబర్ 201లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిలో వ్యవసాయ గోదాములు నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. దీంతో అప్పట్లోనే స్థానిక రెవెన్యూ అధికారులు పొలానికి సంబంధించిన సర్వేలు సైతం పూర్తి చేశారు. గోదాముల నిర్మాణానికి నాబార్డు నిధులు సుమారు రూ.3కోట్లు మంజూరైనట్లు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు వెల్లడించారు. సుమారు ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాలు, ఇతర ఉత్పత్తులను నిల్వ చేసుకునే విధంగా గోదాములను నిర్మించనున్నట్లు అప్పటి పాలకులు, అధికారులు ప్రకటించారు. ఆరేళ్ల క్రితం అప్పటి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గోదాముల నిర్మాణ పనులకు శంకుస్థాపన సైతం చేశారు. కాగా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో రైతులు తమ ఉత్పత్తులను ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేస్తు ఆర్థికంగా నష్టపోతున్నారు.

9,567 మంది రైతులకు మేలు

ఇప్పటి వరకు కొత్తూరు, నందిగామ మండలాల్లో గోదాములు లేక రైతులు మద్దతు ధర లేకున్నప్పటికీ తమ ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించేవారు. రెండు మండలాల్లో 18 వేల ఎకరాల సాగుభూమి ఉంది. సుమారు 9,567 మంది రైతులు యాసంగి, వానాకాలం పంటలను సాగు చేస్తున్నారు. ప్రతీ వానాకాలం 63 వేల క్వింటాళ్ల వరి, 2.40లక్షల వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 30 వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి.

అవసరమైన చోట నిర్మిస్తాం



గిడ్డంగుల(గోదాములు) నిర్మిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. గిడ్డంగుల్లో వారి ఉత్పత్తులను నిల్వ చేసుకుని మార్కెట్‌లో సరైన ధరలు ఉన్నప్పుడే విక్రయించుకోవచ్చు. నియోజకవర్గంలో రైతులకు అవసరమైన చోట తప్పకుండా వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణం కోసం కృషి చేస్తాం. రైతులకు ఉపయోగం లేని చోట గిడ్డంగులు నిర్మించిన ఉపయోగం ఉండదు.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్